

టన్ను చీనీ రూ.26,120

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.26,120, కనిష్టంగా రూ.3,500 ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.8

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.8 కనిష్టంగా రూ.6 ప్రకారం ధర పలికింది.



న్యూస్‌రీల్

నిలకడగా చింత పండు ధరలు



హిందూపురం మార్కెట్‌లో అమ్మకానికి వచ్చిన చింత పండు

హిందూపురం అర్బన్: చింతపండు ధరలు మార్కెట్‌లో నిలకడగా కొనసాగుతున్నాయి. సోమవారం హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు 1991.70 క్వింటాళ్ల చింతపండు రాగా, అధికారులు ఈ–నామ్ పద్ధతిలో వేలం పాట నిర్వహించారు. ఇందులో కరిపులి రకం క్వింటా గరిష్టంగా రూ. 30 వేలు, కనిష్టంగా రూ.8,200, సగటున రూ.15 వేల ప్రకారం ధర పలికింది. అలాగే ప్లవర్ రకం క్వింటా గరిష్టంగా రూ. 12,500, కనిష్టంగా రూ. 4,500, సగటు రూ.7 వేల ప్రకారం క్రయవిక్రయాలు సాగినట్లు మార్కెట్ కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు.

బేస్‌బాల్ పోటీల్లో నల్లమాడ విద్యార్థుల సత్తా

- జాతీయ స్థాయి టోర్నమెంట్‌కు ఇద్దరి ఎంపిక



బేస్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు భాస్కర్‌నాయక్, లిఖిత్‌నాయక్

నల్లమాడ: బేస్‌బాల్ పోటీల్లో నల్లమాడ విద్యార్థులు సత్తా చాటారు. అండర్–14 జాతీయ స్థాయి టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం కుసుమూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీల్లో స్థానిక ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు కె. భాస్కర్ నాయక్ (9వ తరగతి), ఎం. లిఖిత్ నాయక్ (8వ తరగతి) జిల్లా జట్టు తరఫున ఆడి సత్తా చాటారు. దీంతో నిర్వాహకులు వారిని జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అండర్–14 రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసినట్లు పాఠశాల హెచ్‌ఎం సతీష్, వసతి గృహ సంక్షేమాధికారి సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిద్దరూ పంజాబ్‌లోని సంగ్రూర్‌లో ఈనెల 27 నుంచి 31 వరకు జరిగే జాతీయ టోర్నమెంట్‌లో పాల్గొననున్నట్లు వెల్లడించారు. జాతీయ స్థాయి టోర్నమెంట్‌కు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం, హెచ్‌డబ్ల్యూఓతో పాటు పీడీ ధరణి, పాఠశాల సిబ్బంది అభినందించారు.

సూపర్ స్పెషాలిటీలో పీడియాట్రిక్ సర్జరీ విభాగం



పీడియాట్రిక్ సర్జరీ విభాగాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు

అనంతపురం మెడికల్: సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన పీడియాట్రిక్ సర్జరీ విభాగాన్ని సోమవారం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజనాస్పత్రి నుంచి సూపర్ స్పెషాలిటీకి పీడియాట్రిక్ సర్జరీ విభాగాన్ని మార్చడం జరిగిందన్నారు. వారంలో మూడు రోజుల పాటు ఓపీ, మూడు రోజుల పాటు శస్త్రచికిత్సలు జరిగేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. చిన్నారుల్లో హెర్నియా, మూత్రనాళం, మలనాళం, అపెండిసైటిస్ తదితర సమస్యలకు శస్త్రచికిత్సలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనస్థీషియా ప్రొఫెసర్ డాక్టర్ సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఐసీడీఎస్ పీడీ



పుట్టపర్తి అర్బన్: సమీకృత శిశు అభివృద్ధి పథకం (ఐసీడీఎస్) జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్‌గా (పీడీ)గా తోట శ్రీదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. గుంటూరులోని డైరెక్టరేట్ కార్యాలయంలో పని చేస్తున్న ఆమెను, ఉన్నతాధికారులు ఇటీవలే జిల్లా ఇన్‌చార్జ్ పీడీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. దీంతో సోమవారం శ్రీదేవి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ చేతన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, ఇప్పటిదాకా ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీగా పనిచేసిన సుధావరలక్ష్మి తిరిగి ఓడీసీ సీడీపీఓగా పూర్వ స్థానానికి వెళ్లారు.



ఈ చిత్రంలో కలెక్టర్‌కు అర్జీ ఇస్తున్న రైతు పేరు చిమిరాల జగన్నాథ్. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి గ్రామం. పుట్టపర్తి రెవెన్యూ పొలం సర్వే నంబర్ 295–1లోని 32 సెంట్లలో 11 సెంట్లు, సర్వే నంబర్ 296–3లోని 34 సెంట్లలో 12 సెంట్లు, సర్వే నంబర్ 296–7లోని 30 సెంట్లు పైకి 10 సెంట్ల భూమి ఉంది. మూడు సర్వే నంబర్లలో కలిపి మొత్తం 33 సెంట్లకు సంబంధించి రిజిష్టర్ డాక్యుమెంట్లు, లింకు డాక్యుమెంట్లు ఉన్నాయి. అయితే ఆ పొలం ఇతరులు ఆక్రమించారు. అధికారులకు విన్నవించినా.. న్యాయం జరగలేదు. భూమిని సర్వే చేయించి తనకు పాసు పుస్తకం మంజూరు చేయాలని సోమవారం కలెక్టర్‌ను కోరాడు.



ఈమె పేరు లక్ష్మీనరసమ్మ. రొద్దం మండలం కలిపి గ్రామం. సర్వే నంబరు 261–1లో ఎకరా, సర్వే నంబరు–491లో 1.04 ఎకరాలు, సర్వే నంబరు 50లో 60 సెంట్లు భూమి ఉంది. అన్ని చోట్ల ఆమె కుటుంబ సభ్యులే సాగులో ఉన్నారు. అయితే ఆ భూమి మొత్తాన్ని ఆమెకు తెలియకుండా వేరే వాళ్లు ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అవస్థలు పడుతున్నట్లు లక్ష్మీనరసమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగి.. తిరిగి.. అలసిపోయి.. చివరకు కలెక్టరేట్ మెట్లు ఎక్కినట్లు వాపోయారు.



ఇక్కడ కనిపిస్తోన్న రైతు పేరు వెంకటరెడ్డి. కొత్తచెరువు మండలం పోతులకుంట గ్రామం. ఈయనకు సర్వే నంబరు–127లో 31 సెంట్లు, సర్వే నంబరు–137లో 3 సెంట్లు, సర్వే నంబరు–208లో 45 సెంట్ల భూమి ఉంది. అదే గ్రామానికి చెందిన కూటమి నేతలు కొందరు ఆ భూమిని ఆక్రమించారు. దీంతో బాధిత రైతు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇప్పటికీ విచారణ పూర్తి కాలేదు. అయితే ఇంతలోనే కూటమి నేతలు ఆ స్థలంలో రోడ్లు వేశారు. దీంతో వెంకటరెడ్డి నాలుగు నెలల వ్యవధిలోనే 11 సార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా ఫలితం లేదని వాపోయారు.



ఈ చిత్రంలోని రైతు పేరు డోలా ఆదెప్ప. చెన్నేకొత్తపల్లి. ఈ రైతుకు సర్వే నంబరు 288–7లో 2.19 ఎకరాలకు ప్రభుత్వం 1990లో డీ–పట్టా ఇచ్చింది. అప్పటి నుంచి ఆ భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల కొందరు కూటమి నేతలు ఆన్‌లైన్‌లో ఆదెప్ప పొలాన్ని డోలా రాధమ్మ పేరిట మార్చేశారు. దీంతో ఆదెప్ప ఆన్‌లైన్‌లో పేరు మార్చాలని పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. దీంతో సోమవారం మళ్లీ కలెక్టరేట్‌కు వచ్చి అర్జీ ఇచ్చారు.

ప్రజా ప్రదక్షిణ వేదిక!

తూతూమంత్రంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- పదుల సార్లు విన్నవించినా పరిష్కారం కాని సమస్యలు
- ఒకే సమస్యపై పదే పదే వస్తోన్న ఫిర్యాదులు
- కూటమి హయాంలో పెరిగిన భూ సమస్యలు
- అధికారుల అలసత్వంతో పెరిగిన భూకబ్జాలు
- టీడీపీ నేతలు విచ్చలవిడిగా కబ్జా చేస్తున్నట్లు ఆరోపణలు
- మొక్కుబడిగా పరిష్కారం చూపిస్తున్నారని బాధితుల ఆవేదన



ఫిర్యాదుదారులతో కిటకిటలాడుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

సాక్షి, పుట్టపర్తి

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' జిల్లాలో ప్రజా ప్రదక్షిణల వేదికగా సాగుతోంది. ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై గ్రామ, మండల స్థాయిలో అర్జీలిచ్చి...అక్కడ పరిష్కారం కాక ఎంతో ఆశతో ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే 'పరిష్కార వేదిక'కు వస్తున్నారు. అయితే ఇక్కడా సరైన పరిష్కారం దొరకడం లేదు. దీంతో ప్రజలు ఒకే సమస్యపై పదేపదే అర్జీలివ్వడం...అధికారులు వాటిని తీసుకుని బుట్టదాఖలు చేయడం పరిపాటిగా మారింది. ఫలితంగా ప్రతి సోమవారం అర్జీల సంఖ్య 400 దాటిపోతోంది. అధికారులు మాత్రం సమస్యలన్నీ పరిష్కరించినట్లు చెబుతున్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'ను సోమవారం 'సాక్షి' విజిట్ చేయగా.. పలు విషయాలు వెలుగు చూశాయి.

పరిహారం అందలేదు



నాకు గ్రామంలో సర్వే నంబరు 27–4లో రెండు ఎకరాలుండగా... హౌసింగ్ కోసం అధికారులు తీసుకున్నారు. అయితే ఇప్పటి వరకు పరిహారం ఇవ్వలేదు. పోనీ సాగుచేసుకుందామని పొలంలోకి వెళ్తే అధికారులు అడ్డుపడుతున్నారు. గృహ నిర్మాణ సంస్థకు సంబంధించిన మెటీరియల్ అక్కడ దింపారు. న్యాయం చేయాలని అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నా.

– బోయ నరసింహప్ప, మణేసముద్రం, హిందూపురం

పరిష్కార మార్గం చూపిస్తున్నాం



'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో నమోదయ్యే ప్రతి అర్జీకి పరిష్కార మార్గం చూపుతున్నాం. అర్జీలు పునరావృతం కాకూడదన్నదే ముఖ్య ఉద్దేశం. ఒకసారి ఆన్‌లైన్‌లో నమోదు చేసిన సమస్య మరోసారి పునరావృతం కాకుండా చూస్తున్నాం. రెవెన్యూలో అవకతవకలు జరగకుండా చూసుకుంటాం. కబ్జాల విషయంలో విచారణ చేయించి.. బాధితులకు న్యాయం చేస్తున్నాం.

– టీఎస్ చేతన్, కలెక్టర్, శ్రీసత్యసాయి జిల్లా

రెవెన్యూ సమస్యలే అధికం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువు దీరాక రెవెన్యూ సమస్యలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఏ గ్రామంలో చూసినా భూ సమస్యలు పెరిగిపోయాయి. ఇక తమ భూమి కబ్జా చేశారని అందే వినతులు వందల్లోనే ఉంటున్నాయి. కబ్జారాయుళ్లు కూటమి పార్టీల నేతలు కావడంతో అధికారులు పట్టించుకోవడం లేదు. దశాబ్దాల కాలంగా సాగులో ఉన్నోళ్లను కాదని.. వన్–బీలలో పేర్లు మారుస్తున్నారు. వాటన్నింటినీ సరిదిద్దుకునేందుకు నిజమైన అర్హులు అధికారుల చుట్టూ నెలల తరబడి తిరుగుతూనే ఉన్నారు. ఒక్కో సమస్యపై పదిసార్లకుపైగా వినతులు ఇచ్చినట్లు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చిన పది మంది పైగా చెప్పడం గమనార్హం.

తూతూ మంత్రంగా పరిష్కారం

'అర్జీలు పునరావృతం కారాదు' అని కలెక్టర్ చేతన్ ప్రతి వారం ఆదేశిస్తున్నా.. సిబ్బంది పాటించడం లేదు. ప్రజల నుంచి అర్జీలు అందిన వెంటనే పరిష్కరించినట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తున్నారు. దీంతో సమస్య తీరక.... ప్రజలు కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వ్యయప్రయాసల కోర్చి కలెక్టరేట్‌కు వచ్చి ఏకంగా కలెక్టర్‌కే అర్జీ ఇచ్చినా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఈ ప్రభుత్వంతో పాటు అధికారులపై కూడా నమ్మకం పోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

20,070
ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందిన అర్జీలు

11,257
రెవెన్యూకు సంబంధించిన అర్జీలు

4,713
సర్వే సమస్యలపై అందిన అర్జీలు

12,462
అధికారులు పరిష్కరించినట్లు చూపుతున్న అర్జీలు

7,608
పెండింగ్‌లో ఉన్న అర్జీలు

(గణాంకాలు 2024 జూన్ 19 నుంచి 2025 మార్చి 17 వరకు)

ప్రజల్లో నమ్మకం పెంచాలి

ప్రశాంతి నిలయం: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ద్వారా అందే అర్జీలను సకాలంలో పరిష్కరించి ప్రజల్లో నమ్మకం పెంచాలని కలెక్టర్ చేతన్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తంగా 234 అర్జీలు అందాయి. అనంతరం కలెక్టర్ వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో డీఆర్ఓ విజయసారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, సీపీఓ విజయ్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పాల్గొన్నారు.

- పుట్టపర్తిలో 650 దళిత కుటుంబాలు నివసిస్తున్నాయని, శ్మశాన వాటికలేక ఇబ్బందులు పడుతున్నాయని పుట్టపర్తి మున్సిపల్ వైస్ చైర్మన్ మాతంగి తిప్పన్నతో కలిసి ఎమ్మార్పీఎస్ నాయకులు కలెక్టర్‌కు మొరపెట్టారు. వెంటనే శ్మశానికి కావాల్సిన స్థలం కేటాయించాలని కోరారు.
- ఉపాధి కూలీల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జేసీకి వినతి పత్రం అందజేశారు.

ఆదినారాయణ చెర నుంచి భూములను విడిపించండి

ముదిగుబ్బ ఎంపీపీ, బీజేపీ నేత ఆదినారాయణ తమ భూములను ఆన్‌లైన్‌లో ఇతరుల పేరు ఎక్కించి కబ్జా చేశాడని, ఆయనపై చర్యలు తీసుకోవాలని ముదిగుబ్బ మండలం అడవి బ్రాహ్మణపల్లికి చెందిన పలువురు గిరిజనులు కలెక్టర్‌కు విన్నవించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఈ మేరకు ఫిర్యాదు చేశారు. తాము కూలి పనుల కోసం వలస వెళ్లిన సమయంలో ఆదినారాయణ రాజకీయ పలుకుబడితో తమ భూములను ఆక్రమించాడని, తమకు ఆ భూములు తప్ప, వేరే ఆదరువు లేదన్నారు. అందువల్ల తమ భూములను తిరిగి తమకు ఇప్పించి న్యాయం చేయాలని వేడుకున్నారు.

మోహినీ రూపం.. భక్త పారవశ్యం





మోహినీ అవతారంలో లక్ష్మీ నారసింహుడు (ఇన్‌సెట్‌లో) శ్రీవారి కుచ్చుల వాలుజడలు

- వైభవంగా ఖాద్రీశుని బ్రహ్మోత్సవాలు
- మోహినీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీవారు

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. తొమ్మిదో రోజైన సోమవారం స్వామివారు మోహినీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వయ్యారాలు ఒలకబోసే సోయగాలతో, చంకన అమృత భాండాగారాన్ని పెట్టుకొని సుకుమార వేషంలో కనిపించిన శ్రీవారిని దర్శించుకుని భక్తులు తరించారు. ధగధగ మెరిసే పట్టు చీర ధరించి, గుభాళించే కదిరి మల్లెల అలంకరణలో కనిపించిన ఖాద్రీశుని వైభవాన్ని చూస్తే తప్ప చెప్పటం సాధ్యంకాదు. శ్రీవారి కుచ్చుల వాలు జడ ఈ ఉత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాల కడలిని మదించి అందులో ఉద్భవించిన అమృతాన్ని సేవించడానికి దేవతాసురులు పోటీ పడగా, అమృతాన్ని పంచడానికి శ్రీమహావిష్ణువే మోహినీ అవతారమెత్తాడని భక్తుల నమ్మకం. ఈ ఉత్సవ ఉభయదారులుగా కోటా గోపాలకృష్ణయ్య గుప్త కుటుంబ సభ్యులు వ్యవహరించారని ఆలయ సహాయ కమిషనర్ వెండిదండి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

భక్తుల వద్దకే వసంతవల్లభుడు

తిరు వీధుల దర్శనానంతరం స్వామివారు రాత్రంతా పట్టణంలో విహరించారు. ఆలయానికి రాలేకపోతున్న తన భక్తుల ఇళ్ల వద్దకే వెళ్లి దర్శనమిచ్చారు. మంగళవారం సాయంత్రం తిరిగి ఆలయం చేరుకొని అలంకరణ అనంతరం ప్రజా గరుడ సేవలో భాగంగా మరోసారి గరుడవాహనంపై తన భక్తులకు దర్శనమిస్తారు. బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న శ్రీవారి బ్రహ్మ రథోత్సవం ఈ నెల 20న జరగనుంది. ఆలయ అధికారులు ఇప్పటికే తగిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.



శ్రీవారి దర్శనం కోసం ఆలయానికి పోటెత్తిన భక్తజనం

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

- పుట్టపర్తిలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ చేతన్



ఎనుములపల్లి హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి/ పుట్టపర్తి టౌన్: పదో తరగతి పరీక్షలు జిల్లాలో తొలిరోజు సోమవారం ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖాధికారి కృష్ణప్ప తెలిపారు. ధర్మవరం, పెనుకొండ డివిజన్ల పరిధిలో 104 కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్షకు 210 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వెల్లడించారు. 21393 మంది విద్యార్థులకు గాను, 21,183 మంది హాజరయ్యారని వెల్లడించారు.

కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

పదో తరగతి పరీక్ష కేంద్రాలను సోమవారం కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న పరిశీలించారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రాన్ని వారు వేర్వేరుగా సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు కల్పించిన తాగునీరు, ఫర్నీచర్, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు తదితర మౌలిక సదుపాయలపై ఆరా తీశారు. పరీక్షా కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్నీ పరిశీలించారు. అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వారికి మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ... విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, కేంద్రాల్లోకి ఇతరులను అనుమతించకూడదన్నారు.

భూ సేకరణ విరమించుకోవాలి

- లేదంటే ఆత్మహత్యలే శరణ్యం
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల నిరసన



తహసీల్దార్ కరుణాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

మడకశిర రూరల్: ''పరిశ్రమల కోసం ఇప్పటికే 15 ఏళ్ల క్రితం గొడనహళ్లి పంచాయతీ పరిధిలో 800 ఎకరాలు తీసుకున్నారు. ఇప్పుడు మళ్లీ పరిశ్రమల పేరు చెప్పి గొడనహళ్లి, తురుకువాండ్ల పల్లి, జమ్మానిపల్లి గ్రామాల పరిధిలో 2 వేల ఎకరాలు సేకరిస్తామంటున్నారు. పరిశ్రమలు కావాల్సిందే... కానీ అందుకు మా కడుపు కొట్టొద్దు. వ్యవసాయం తప్ప మరో పని తెలియని వాళ్లం. మా భూములు తీసుకుంటే మేమెట్టా బతికేది. ఇప్పటికైనా భూసేకరణను విరమించుకోవాలి. లేదంటే మాకు ఆత్మహత్యలే శరణ్యం'' అంటూ మండల పరిధిలోని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గొడనహళ్లి, తురుకువాండ్ల పల్లి, జమ్మానిపల్లి గ్రామాల పరిధిలో ఏపీఐఐసీ ద్వారా ప్రభుత్వం 2 వేల ఎకరాల భూసేకరణను సిద్ధమైంది. దీంతో రైతులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. అప్పులు చేసి బోర్లు వేసి పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్నామన్నారు. ఈ భూములను తీసుకుంటే మూడు గ్రామాల్లోని చిన్న, సన్న కారు రైతులు దాదాపు 400 మంది వరకు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న తమకు అన్యాయం చేయవద్దన్నారు. అనంతరం తహసీల్దార్ కరుణాకర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ తెలిపారు.

EAPCET 2nd BATCH STARTS : 20th MARCH
NEET | JEE-IIT
AC CAMPUS | ONLY GIRLS
GLOBAL SCHOOL COLLEGE Near SJR Function Hall Opp.TV Tower, ANANTAPUR
9247134363, 8555826272 హాస్టల్ కలదు

SRI MASTERS ACADEMY CLASSES STARTS 24-03-2025
9440774498, 9440445898
45 DAILY TESTS & 8 GRAND TESTS
EAPCET NEET JEE (MAINS)
SEPARATE HOSTEL FOR BOYS & GIRLS
GIRLS CAMPUS Opp. RTA Office Bhairava Nagar, ATP
BOYS CAMPUS Intel Campus, Akkampalli Cross, KLD Road, ATP

EAMCET NEET JEE
APRJC RDT పాలిసెట్
హాస్టల్ కలదు Classes Starts : 21st March
SARADA ACADEMY 2వ క్రాస్, అశోక్‌నగర్, అనంతపురము
9866117303, 9908829351

క్లుప్తంగా

మహిళల భద్రతకు పెద్దపీట

- జిల్లాలో ఆరు 'శక్తి' టీంలు ఏర్పాటు
- జెండా ఊపి వాహనాలను ప్రారంభించిన ఎస్పీ రత్న



శక్తి టీం వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎస్పీరత్న

పుట్టపర్తి టౌన్: మహిళల భద్రత కోసం జిల్లాలో ఆరు 'శక్తి' టీంలు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రత్న తెలిపారు. సోమవారం ఆమె శక్తి టీంల కోసం 'మీ రక్షణ- మా కర్తవ్యం' అనే నినాదాలతో రూపొందించిన వాహనాలను జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ..పోలీస్ సబ్‌డివిజన్‌కు ఒక టీం చొప్పున జిల్లాలో ఆరు శక్తి టీంలు ఏర్పాటు చేశామన్నారు. టీంలో నోడల్ అధికారిగా మహిళా డీఎస్పీ, ఎస్ఐ, ఏఎస్ఐ నేతృత్వంలో ఇద్దరు మహిళా సిబ్బంది, నలుగురు కానిస్టేబుళ్లు మొత్తం ఆరుగురు సభ్యులు ఉంటారన్నారు. శక్తి టీంలు 24 గంటలూ అందుబాటులో ఉంటాయన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, ఆకతాయిలు వేధింపులు నియంత్రించడంతో పాటు మహిళలకు రక్షణగా నిలిచే చట్టాలపై అవగాహన కోసం రాష్ట్ర ప్రభుత్వం 'శక్తి యాప్'ను రూపొందించినట్లు తెలిపారు. ఆపదలో ఉన్న మహిళలు, బాలికలు 112 లేదా 100 నంబర్‌కు కాల్‌చేస్తే సంఘటనా స్థలానికి వెళ్లి తక్షణ సాయం అందిస్తాయన్నారు. కార్యక్రమంలో మహిళా పీఎస్ డీఎస్పీ ఆదినారాయణ, పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్ఐ ప్రదీప్‌కుమార్, ఆర్ఐ మహేష్, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ గోపీనాథ్‌రెడ్డి, డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాసులు, ఆర్ఎస్ఐలు వెంకటేశ్వర్లు, ప్రదీప్‌సింగ్‌తోపాటు శక్తి టీం సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం మహిళల ధర్నా



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

అగళి: మండలంలోని ముక్కడమపల్లి గ్రామంలో తాగునీటి కోసం ఎస్సీ కాలనీ మహిళలు రోడ్డెక్కారు. రత్నగిరికి వెళ్లే మార్గంపై బైఠాయించి నిరసన తెలపడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. నెల రోజులుగా తాగునీరు రాకపోవడంతో నానా అవస్థలు పడుతున్నామని ఈ సందర్భంగా వారు ఆందోళన వ్యక్తం చేశారు. సర్పంచ్ నరసింహమూర్తికి, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. నీటి కోసం సుమారు రెండు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ప్లాస్టిక్ సంచుల కలకలం

- అర కిలోమీటరు దూరంతో మూడు సంచులు
- రైల్వే, సివిల్ పోలీసుల పరుగులు
- బస్తాల్లో బయటపడిన మేక పిల్లల కళేబరాలు



యర్రంపల్లి రైల్వే వంతెన కింద పడేసిన ప్లాస్టిక్ బస్తా



కేబుల్ కోసం తవ్విన గుంతలో పడేసిన ప్లాస్టిక్ బస్తా

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రానికి సమీపంలోని నిర్జన ప్రదేశాల్లో ప్లాస్టిక్ బస్తా నుంచి దుర్వాసన వస్తోందని స్థానికులు ఇచ్చిన సమాచారంతో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. విషయం తెలుసుకున్న సీకేపల్లి సివిల్, హిందూపురం రైల్వే పోలీసులు ఉరుకుల పరుగులతో గాలింపు చేపట్టారు. అయితే ఒకటి కాదు... రెండు కాదు... అర కిలోమీటరుకు ఒకటి చొప్పున పడేసిన మూడు ప్లాస్టిక్ బస్తాల్లో నుంచి కుళ్లిన దుర్వాసన వెలువడుతుండడంతో పోలీసులు ఒక్కసారిగా బెంబేలెత్తిపోయారు.

ఏడు గంటల పాటు ఉత్కంఠ

చెన్నేకొత్తపల్లి సమీపంలో ఉన్న యర్రంపల్లి రైల్వే వంతన కింద ప్లాస్టిక్ సంచి నుంచి దుర్వాసన వస్తున్న విషయాన్ని పసిగట్టిన స్థానికుల సమాచారంతో ధర్మవరం రైల్వే సీఐ అశోక్‌కుమార్, రామగిరి సీఐ శ్రీధర్, చెన్నేకొత్తపల్లి ఎస్ఐ సత్యనారాయణ, హిందూపురం రైల్వే ఎస్ఐ సాయినాథ్‌రెడ్డి, ఐడబ్ల్యూ రాజశేఖర్, హెడ్ కానిస్టేబుల్ ఎర్రిస్వామి, కానిస్టేబుల్ రమేష్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. అదే సమయంలో అక్కడికి అర కిలోమీటర్ దూరంలో మరో బస్తా నుంచి దుర్వాసన వస్తోందని తెలుసుకున్న పోలీసులు ఒక్కసారిగా ఆందోళనతో అక్కడకు పరుగు తీశారు. కేబుల్ కోసం తీసిన గుంతలో ప్లాస్టిక్ బస్తాను గుర్తించి వెలికి తీశారు. ఈ లోపు అక్కడికి అర కిలోమీటర్ దూరంలో మరో బస్తా నుంచి దుర్వాసన వస్తోందని తెలుసుకుని అక్కడకూ ఆగమేఘాలపై చేరుకున్నారు. బస్తాల పరిమాణాన్ని బట్టి ముగ్గురు వ్యక్తులను హతమార్చి ప్లాస్టిక్ సంచుల్లో కూరి పడేశారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. దాదాపు ఏడు గంటల పాటు యర్రంపల్లి వద్ద ఉత్కంఠ వాతావరణం నెలకొంది. ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు అందిన తర్వాత ఒక్కో బస్తాను తెరిచి చూసిన పోలీసులు అవాక్కయ్యారు. అందులో అందరూ ఊహించినట్లుగా వ్యక్తుల మృతదేహాలు కాకుండా మేక పిల్లల కళేబరాలు బయటపడడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఇలా ఎందుకు చేశారు? ఎవరు చేశారు? అనేది తేలాల్సి ఉంది.



పరిశీలిస్తున్న సివిల్, రైల్వే పోలీసులు

రెండో రోజూ శ్రీవారిని తాకిన సూర్యకిరణాలు



ధర్మవరం అర్బన్: స్థానిక లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలోని చెన్నకేశవస్వామి మూలవిరాట్‌ను సోమవారం ఉదయం రెండో రోజు కూడా సూర్యకిరణాలు తాకాయి. సూర్య పూజా మహోత్సవాలలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. మూడు రోజుల పాటు స్వామిని సూర్య కిరణాలు తాకుతాయని ఏటా ఇలా జరుగుతుందని అర్చకులు తెలిపారు.

రెడ్డెప్పశెట్టి ఎస్టేట్‌లో వలస కూలీ మృతి

చిలమత్తూరు: మండలంలోని కొడికొండ సమీపంలో రియల్టర్ రెడ్డెప్పశెట్టికి చెందిన ఎస్టేట్‌లో పనిచేస్తున్న వలస కూలీ ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు ఎస్ఐ మునీర్ అహమ్మద్ తెలిపారు. ఉత్తర ప్రదేశ్‌లోని మీర్జాపూర్‌కు చెందిన అర్జున్ (21) విష ద్రావకం సేవించి ఆత్మహత్య చేసుకున్నట్లుగా సమాచారం అందడంతో అక్కడికెళ్లి పరిశీలించామన్నారు. విషం ఎందుకు తాగాడనేది తెలియాల్సి ఉందన్నారు. అయితే ఈ విషయం బయట పడకుండా ఎస్టేట్ యాజమాన్యం తొక్కి పెట్టి గుట్టు చప్పుడు కాకుండా అర్జున్ మృతదేహాన్ని ఖననం చేయడం అనుమానాలకు తావిస్తోంది. కొడికొండ చెరువులో మృతదేహాన్ని ఖననం చేసేందుకు ప్రయత్నించగా గ్రామస్తులు అడ్డుకోవడంతో తిరిగి ఎస్టేట్ పరిసరాల్లోనే పాతిపెట్టారు. వేధింపులు తారాస్థాయికి చేరుకోవడమే ఆత్మహత్యకు కారణంగా స్థానికులు చర్చించుకుంటున్నారు.

ప్రమాదంలో యువకుడి మృతి

బెళుగుప్ప: మండలంలోని బి.రామసాగరం వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బెళుగుప్పకు చెందిన బోయ చంద్రన్న కుమారుడు సతీష్‌కుమార్ (19) అనంతపురంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసి ఇటీవల ఇంటికి వచ్చాడు. తనతో పాటు అదే కళాశాలలో చదువుకున్న స్నేహితుడు, శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం భానుకోట గ్రామానికి చెందిన పవన్‌కుమార్‌తో కలసి సోమవారం ఉరవకొండ మండలం వై.రాంపురంలో ఎర్రితాత రథోత్సవానికి వెళ్లాడు. అనంతరం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన వారు బి.రామసాగరం క్రాస్ వద్దకుచేరుకోగానే అదుపు తప్పి కిందపడ్డారు. చీకటిలో అటుగా వచ్చిన కొందరు గుర్తించి కుటుంబసభ్యులకు విషయం తెలిసి, 108 అంబులెన్స్ ద్వారా కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సతీష్‌కుమార్ మృతిచెందినట్లు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడిన పవన్‌కుమార్‌కు చికిత్సలు అందించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వలంటీర్లను మోసగించిన బాబు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



మాట్లాడుతున్న కేవీ ఉషశ్రీచరణ్

పరిగి: తాము అధికారంలోకి రాగానే వలంటీర్ వ్యవస్థ యథాతథంగా కొనసాగించడంతో పాటూ వారికి నెలకు రూ.10 వేల చొప్పున వేతనం ఇస్తామని నమ్మబలికిన చంద్రబాబు... చివరకు అధికారం చేపట్టిన తర్వాత 2.50 లక్షల మంది వలంటీర్లను తొలగించి వారి కుటుంబాలను రోడ్డు పాలు చేశారంటూ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కేవీ ఉషశ్రీచరణ్ మండిపడ్డారు. పరిగి మండలం అక్కంపల్లిలో సోమవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి గ్రామ స్వరాజ్యాన్ని సిద్ధింపజేశారన్నారు. మూడున్నర లక్షల నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కాయన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ వలంటీర్ల ద్వారా సంక్షేమ ఫలాలను అత్యంత పారదర్శకంగా అందజేశారన్నారు. అలాంటి వ్యవస్థలను సీఎం చంద్రబాబు నిర్వీర్యం చేసి, కేవలం కూటమి నాయకులు, కార్యకర్తలకు ప్రజాధనాన్ని దోచి పెడుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా వలెంటీర్లు రోడ్డెక్కి ధర్నా చేసినప్పటికీ కూటమి సర్కార్‌లో చలనం లేకపోవడం మోసానికి ప్రతిరూపంగా నిలిచిందన్నారు. తల్లికి వందనం పథకం కింద ఒక్కొక్కరికి రూ. 15 వేలు చొప్పున ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ లబ్ధి చేకూరుస్తామన్న చంద్రబాబు... నేడు తల్లులనూ దగా చేశారన్నారు. డీఎస్సీ ఫైలుపై తొలి సంతకం చేసి తొమ్మిది నెలలు కావస్తున్నా నేటికీ నోటిఫికేషన్ ఇవ్వకుండా నిరుద్యోగ యువతీయువకులతో ప్రభుత్వం చెలగాటమాడుతోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ తీరులో మార్పు రాకపోతే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల బరి తెగింపు

- ప్రభుత్వ చింత వనం నుంచి అక్రమంగా మట్టి తరలింపు
- తవ్వకాలను అడ్డుకుని హిటాచీని పోలీసులకు అప్పగించిన ఇరిగేషన్ అధికారులు



చింత తోపులో అక్రమంగా మట్టి తవ్వుతున్న దృశ్యం



హిటాచీని స్వాధీనం చేసుకుంటున్న ఇరిగేషన్ డీఈ లక్ష్మీనారాయణ

గోరంట్ల: రాష్ట్రంలో కూటమి సర్కార్ ఏర్పాటైన తర్వాత టీడీపీ నాయకులు బరితెగించారు. సంపద సృష్టి పేరుతో ఇష్టానుసారంగా ప్రకృతి వనరులను దోచేయడం మొదలు పెట్టారు. చివరకు ప్రభుత్వ చింత వనం నుంచి అక్రమంగా మట్టి తరలింపులు చేపట్టడం టీడీపీ నేతల బరితెగింపులకు పరాకాష్టగా నిలిచింది. వివరాలు.. గోరంట్ల మండలం పాలసముద్రం సమీపంలోని సర్వే నంబర్ 205లో 23 సంవత్సరాల క్రితం అప్పటి జిల్లా కలెక్టర్ సోమేష్ కుమార్ చొరవతో చింత- నిశ్చింత కార్యక్రమం కింద ప్రభుత్వ చింత వనం అభివృద్ధి చేశారు. ప్రస్తుతం చింత చెట్లు ఏపుగా పెరిగి ఫలసాయాన్ని అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఫీల్డ్ అసిస్టెంట్‌తో కలసి టీడీపీ నేతలు కొందరు ఎలాంటి అనుమతులు లేకుండానే చింత వనం నుంచి మట్టి తరలింపులు చేపట్టారు. ఇందు కోసం హిటాచీలను రంగంలో దించారు. రేయింబవళ్లూ మట్టిని తవ్వి టిప్పర్ల ద్వారా రియల్టర్ల భూములకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న పెనుకొండ డివిజన్ నీటి పారుదల శాఖ డీఈ లక్ష్మీనారాయణ అక్కడకు చేరుకుని పరిశీలించారు. మట్టి తవ్వకాలు సాగిస్తున్న హిటాచీని స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. ఘటనపై డీఈ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, టీడీపీ ముఖ్యనేత అండతో కొంత కాలంగా స్థానిక చోటా నాయకులు అక్రమంగా మట్టి తరలించి రూ. లక్షల్లో సొమ్ము చేసుకున్న వైనంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రకృతి వ్యవసాయంపై 22 నుంచి సదస్సు

పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్



ప్రశాంతి నిలయం: అనంత సుస్థిర వ్యవసాయ వేదిక ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకూ అనంతపురంలో జరిగే సదస్సును సద్వినియోగం చేసుకోవాలని రైతులకు కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించి 'మన వ్యవసాయం, పంటలు, వంటలు, ఆరోగ్యం' అంశంతో ముద్రించిన పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 22న ప్రకృతి వ్యవసాయంపై, 23న పంటలు, వంటలు, ఆరోగ్యంపై, 24న మారుతున్న వాతావరణ పరిస్థితులు- వ్యవసాయంపై సదస్సులు ఉంటాయన్నారు. రోజూ వెయ్యి మంది రైతులు పాల్గొనేలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు హాజరై ప్రకృతి వ్యవసాయంపై కొత్త విషయాలను వివరిస్తారని, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలతో కలసి నిర్వహిస్తున్న సదస్సును సద్వినియోగం చేసుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జేడీఏ సుబ్బారావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, జనజాగృత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు డీపీ బలరాం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సీడీసీ శంకర్, టింబక్టు శ్రీకాంత్, సుస్థిర వ్యవసాయ వేదిక ప్రతినిధులు ఆదినారాయణ, ఉత్తప్ప తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తరాదు: వేసవి ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలో ఎక్కడేగాని తాగునీటి సమస్య తలెత్తరాదని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. తాగునీరు, వడగాలులు, పీ-4 సర్వే, రీ సర్వే, పీజీఆర్ఎస్ అంశాలపై సోమవారం కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన సమీక్షించారు. తాగునీటి సమస్యలు తలెత్తే ప్రాంతాలను ముందస్తుగా గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాబోవు మూడు నెలలు ఎంతో కీలకమని, పీ-4 అమలుపై ప్రజాభిప్రాయ సేకరణను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. జేసీ అభిషేక్‌కుమార్, అన్ని మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

పరిటాల పేరు చెప్పి రూ.లక్షలు దోచేశాడు

- ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎస్పీకి బాధితుడి ఫిర్యాదు
- ఉద్యోగ కల్పన పేరుతో ఘరానా మోసం
- ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి : ఎస్పీ



మీడియాతో మాట్లాడుతున్న లాలూనాయక్



అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: రాప్తాడు నియోజకవర్గ ఎమ్మెల్యే పరిటాల సునీత తనయుడు, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పేరు చెప్పి రూ.లక్షలు దోచేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ ఎస్పీ రత్నకు బాధితుడు లాలూనాయక్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీని కలసి తన ఫిర్యాదును అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. 'మాది ముదిగుబ్బ మండలం పూజారి తండా. నా పేరు రమావత్ లాలూనాయక్. చదువులు పూర్తి చేసుకున్న నా కుమారుడు ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్నాడు. నాతో పరిచయమున్న ముదిగుబ్బ మండలం పొడరాళ్లపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నేత వెంకటనారాయణ ఓ రోజు నన్ను కలసి నా కుమారుడి ఉద్యోగం గురించి అడిగాడు. చాలా ప్రయత్నాలు చేస్తున్నా ఏ ఒక్కటీ దొరకలేదని అన్నా. అయితే తనకు పరిటాల శ్రీరామ్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, శ్రీరామ్‌కు చెప్పి అనంతపురంలోని కలెక్టరేట్‌లో నీ కుమారుడికి కంప్యూటర్ ఆపరేటర్‌గా ఉద్యోగం ఇప్పిస్తానని అన్నాడు. మొదట నేను నమ్మలేదు. అయితే తన మాట శ్రీరామ్ జవదాటడంటూ నమ్మబలికాడు. ఉద్యోగం కావాలంటే రూ.3.50 లక్షలు ఇవ్వాలన్నాడు. దీంతో అతని మాటలు నమ్మి గత ఏడాది ఆగస్టులో రూ.3.50 లక్షలు ఇచ్చాను. నెలలు గడుస్తున్నా ఉద్యోగం కల్పించే విషయం గురించి ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. పలుమార్లు అడిగినా ఇదిగో... అదిగో అంటూ చెబుతూ వచ్చాడు. రెండు రోజుల క్రితం గట్టిగా నిలదీశా. ఉద్యోగం లేదు.... గిద్యోగం లేదు. డబ్బు కూడా వెనక్కు ఇవ్వను. నీ దిక్కున్న చోటుకెళ్లి చెప్పుకో. ఎక్కువ మాట్లాడితే అధికారంలో ఉన్నాం. పోలీసులకు చెప్పి నీ మీదే కేసు పెట్టిస్తా. కాదూకూడదంటావా శ్రీరామ్‌తో చెప్పి నిన్ను చంపిస్తా అంటూ బెదిరించాడు. అయ్యా.. నేను పేదోడిని నాకు న్యాయం చేయాలని ఎస్పీ ఎదుట మొరపెట్టుకున్నా. మేడమ్ స్పందించి న్యాయం చేస్తానని మాటిచ్చారు' అంటూ వివరించాడు.

50 వినతులు

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 50 వినతులు అందాయి. ఎస్పీ రత్న స్వయంగా వినతులు స్వీకరించి బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్టపరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీలు ఆదినారాయణ, విజయ్‌కుమార్, లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

బడ్జెట్‌లో చేనేతలకు అన్యాయం

- ఏపీ చేనేత కార్మిక సంఘం వినూత్న నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

ధర్మవరం: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో చేనేత రంగానికి అరకొర కేటాయింపులు జరిపి చేనేతలకు తీరని అన్యాయం చేసిందని, ప్రభుత్వ చర్యల కారణంగా చేనేత మనుగడ ప్రశ్నార్థకమవుతోందని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుడగ వెంకటనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. చేనేతలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సోమవారం ధర్మవరంలోని కాలేజ్ సర్కిల్ నుంచి అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడారు. ప్రస్తుతం చేనేత రంగం ఎదుర్కొంటున్న సంక్షోభం నుంచి చేనేతలను ఆదుకునేందుకు రూ.2 వేల కోట్లు కేటాయిస్తారని భావించామన్నారు. ఇదే అంశాన్ని ఎన్నికలకు ముందు సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు నారా లోకేష్ సైతం ధర్మవరంలో నేతన్నలకు స్పష్టమైన భరోసానిచ్చారన్నారు. చేనేతలకు జీఎస్టీని ఎత్తివేస్తామని, 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ ఇస్తామని, ఆప్కో ద్వారా సొసైటీలకు నిధులు ఇస్తామని హామీలు గుప్పించారన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వం అమలు చేస్తున్న నేతన్న నేస్తం పథకాన్ని ఆపేశారన్నారు. అంతేకాక రాష్ట్ర బడ్జెట్‌లో చేనేత రంగానికి కేవలం రూ.138కోట్లు నిధులు మాత్రమే కేటాయించి తీరని అన్యాయం చేశారన్నారు. ఈ నిధులు ఉద్యోగుల జీతభత్యాలకు సరిపోతాయని, ఇక చేనేతలకు ఏం న్యాయం చేస్తారని ప్రశ్నించారు. తక్షణం ప్రభుత్వం స్పందించి ఎన్నికలకు ముందు చేనేతలకు ఇచ్చిన హామీలను అమలు చేసి బడ్జెట్‌లో నిధులు సరిపడా కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, నాయకులు చెన్నంపల్లి శ్రీనివాసులు, వెంకటస్వామి, ఆదినారాయణ, శ్రీనివాసులు, శ్రీధర్, రంగయ్య, కొండ, పెద్దకోట్ల గణేష్, కేశవ, రమణ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రహ్లాద సమేత నారసింహుడు ఇక్కడే...



బ్రహ్మోత్సవాల ప్రత్యేకం



భక్త ప్రహ్లాద సమేత నారసింహుడు

కదిరి: నవ నారసింహ క్షేత్రాల్లో ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం కూడా ఒకటి. ఇక్కడ స్వామివారు నిత్య పూజలతో వెలుగొందుతున్నారు. అయితే తన ప్రియభక్తుడు ప్రహ్లాదుడితో కలసి ఉన్న నరసింహస్వామి దర్శనం కదిరిలో తప్ప దేశంలో మరెక్కడా లేదు. నారసింహుడికి ఎడమ వైపు ప్రహ్లాదుడు నిల్చొని ఉండడం ఇక్కడ చూడవచ్చు. 'భక్త ప్రహ్లాద సమేత నారసింహుడి దర్శనం.. పాప విమోచనం' అని ఇక్కడి అర్చక పండితులు చెబుతున్నారు. సైన్స్‌కు కూడా అంతుచిక్కని దైవ రహస్యం మరొకటి ఇక్కడ గమనించవచ్చు. ఇక్కడి మూలవిరాట్‌కు ప్రతి నెలా స్వాతి నక్షత్రం రోజు మాత్రమే అభిషేకం చేస్తారు. అభిషేకం చేసిన అనంతరం మూలవిరాట్ నుంచి స్వేద బిందువులు బయటకు వస్తుంటాయి. వస్త్రంతో ఆ స్వేదాన్ని తుడిచినా మళ్లీ వస్తూ ఉంటుంది. స్వామివారు ఇక్కడ నిజరూపంలో ఉన్నారని చెప్పడానికే ఇలా స్వేద బిందువులు వస్తుంటాయని భక్తుల నమ్మకం.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

అడ్మిషన్స్

■ B.Sc (MLT), BPT (ఫిజియోథెరపీ)కి Management సీట్స్ కలవు. అర్హత :ఇంటర్‌లో Bi.PC పాస్ (లేదా) ఒకేషనల్ గ్రూప్ తో పాటు బ్రిడ్జి కోర్స్ పాస్. Contact : G. MURALI, 9030661651, అనంతపురం [A-1537]

REAL ESTATE

TO-LET

■ డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు, మంచినీరు పుష్కలం, బాడుగ Rs. 8000/- మాత్రమే. అనంతపురం టౌన్ నందు కళ్యాణదుర్గం రోడ్డుకు, Dr. రజాక్ హాస్పిటల్ వద్ద. Ph: 9951626131. [A-1543]

STAR REAL ESTATES

■ అనంతపురం నుంచి కేవలం 7 కి.మీ. లోపలే ATP నుండి ధర్మవరం వెళ్ళే 100 అ॥ రోడ్డు దగ్గరలో సెంటు కేవలం ₹2,49,000 నుండి ప్రారంభం. మరిన్ని వివరాల కోసం సెల్: 9396205666, షేక్షావలి, స్టార్ రియల్ ఎస్టేట్స్, రాంనగర్ రిజిస్టర్ ఆఫీస్ ఎదురుగా, ATP. [A-1541]

SERVICES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647. [V-6685]

WANTED

■ SOLAR ప్రొడక్ట్స్ మార్కెటింగ్ కొరకు అనుభవము గల సేల్స్ పర్సన్స్ కావలెను. # ప్రశాంతి నగర్, తపోవనం దగ్గర, అనంతపురం. 9160353879. [SCA25002195]

■ Wanted Typist for IIT Coaching Center. VENUE: ANANTAPUR, NEAR PVKK ENGINEERING COLLEGE. Contact Phone No : 7337006839. [SCA25002216]

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25,000 నుండి 30,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95504 67459. [SCA 25002218]

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 20K. Ph: 8977639663, 8977639662 [SCA25002130]

■ అనంతపురం పట్టణంలోని ప్రముఖ కళాశాలకు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ సబ్జెక్టుల సీనియర్ మరియు జూనియర్ లెక్చరర్లు, లేడీ మరియు జెంట్స్ వార్డెన్లు, కాలేజ్ లోనే ఉండే బాత్రూం కడిగే వాళ్ళు మరియు కసువు ఊడ్చే వాళ్ళు కావలెను. సెల్ : 8019545433, 8019787833, 9652390088. [A-1540]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!

4 లైన్లు రూ. 270/-
అదనపు లైను రూ. 60/-
ప్రతి 3 ప్రకటనలకు 1 ప్రకటన ఉచితం
ANANTHAPURAMU : 9010567770, 9492288307
DHARMAVARAM & PUTTAPARTHI : 9912220726, 7093150088
HINDUPUR & MADAKASIRA : 9912220723
GUNTAKAL & TADIPATRI : 9912220722
KADIRI : 7093150088
RAYADURG : 9010470185